
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
మంగళవారం 2 డిసెంబరు 2025





అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

జాతీయ రహదారి పనుల్లో జాప్యం చేయొద్దు

- అధికారులు సమన్వయంతో పనిచేయండి
- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 65వ నంబర్ జాతీయ రహదారి పనుల్లో జాప్యం చేయొద్దని, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. నేషనల్ హైవే అథారిటీ, విద్యుత్, ట్రాఫిక్, పోలీసు అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రాజెక్టు పనులను సమగ్ర ప్రణాళికతో అమలు చేయాలని సూచించారు. పనుల కారణంగా వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని చర్యలు తీసుకోవాలన్నారు. హైవే పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ రఘునందన్‌రావు, నేషనల్ హైవే అథారిటీ ఎస్ఈ ధర్మారెడ్డి, ఈఈ రమేష్, ఎగ్జిక్యూటివ్ కన్సల్టెంట్ శాస్త్రి, ఆర్డీవో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



మెడల్స్ అందజేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డిఅర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన 11వ అంతర్ జిల్లా బాస్కెట్ బాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో హైదరాబాద్ జిల్లా జట్టు, ద్వితీయ స్థానంలో రంగారెడ్డి జట్టు, తృతీయ స్థానంలో మేడ్చల్ జట్టు నిలిచింది. మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా జట్టు, ద్వితీయ స్థానంలో హైదరాబాద్ జట్టు, తృతీయ స్థానంలో రంగారెడ్డి జట్టు నిలిచింది. విజేతలను నిర్మలాజగ్గారెడ్డి అభినందించి మెడల్స్, ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వేశ్వర్‌రెడ్డి, మెదక్ జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్, రాష్ట్ర కోశాధికారి చంద్రశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంతకిషన్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ క్రీడాకారుడితో నిర్మలాజగ్గారెడ్డి, నాయకులు

సిగాచి బాధిత కుటుంబాలకు పరిహారంపై నిర్లక్ష్యమెందుకు?
ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు ఆవేదన
సంగారెడ్డిలో కలెక్టర్, ఎస్పీకి వినతిపత్రం అందజేత 6

టైర్ పేలి పల్టీ కొట్టిన తుపాన్ వాహనం
ఐదుగురి పరిస్థితి విషమం
హుల్గెల్లి హైవేపై ఘటన 6



చేగుంటలో భారీ జనంతో నామినేషన్‌కు తరలివెళ్తున్న అభ్యర్థి

రాత్రి దాకా దాఖలు

రెండో విడతకు మరో రోజు మిగిలి ఉన్నా నామినేషన్లకు పోటెత్తిన అభ్యర్థులు

సంగారెడ్డి టౌన్/మెదక్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల రెండో రోజైన సోమవారం కేంద్రాలకు అభ్యర్థులు పోటెత్తారు. మంగళవారం నామినేషన్లకు చివరి రోజు కాగా, ఇంకా ఒక రోజు మిగిలి ఉన్నప్పటికీ ముందే అభ్యర్థులు కేంద్రాల్లో వరుస కట్టారు. సోమవారం ఏకాదశి తిథి కావడంతో కలిసివస్తుందనే ఉద్దేశంతో భారీగా తరలివచ్చారు. సాయంత్రం ఐదు గంటల వరకు సమయం కాగా, ఆలోపు వచ్చిన వారిని నామినేషన్ వేసేందుకు అనుమతిచ్చారు. దీంతో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పలుచోట్ల రాత్రి 8 నుంచి 9 గంటల వరకు నామినేషన్ల దాఖలు కొనసాగింది.

సంగారెడ్డి జిల్లాలో ..

సంగారెడ్డి జిల్లాలోని రెండో విడత నామినేషన్లు భారీగా

మిగతా 8వ పేజీలో

సంగారెడ్డి జిల్లాలో రెండోవిడత నామినేషన్ల వివరాలు
గ్రామపంచాయతీలు 243, వార్డులు 2164

మండలం	పంచాయతీలు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
అందోల్	25	74	224	268
చౌటకూరు	15	33	134	187
పుల్కల్	19	31	172	191
వట్‌పల్లి	22	47	190	156
రాయికోడ్	32	53	270	156
ఝరాసంగం	33	74	288	185
జహీరాబాద్	22	56	210	251
మొగుడంపల్లి	22	41	200	93
కోహీర్	23	54	214	162
మునిపల్లి	30	55	262	219




చిన్నశంకరంపేటలోని కేంద్రంలో నామినేషన్ల దాఖలకు రాత్రయినా వేచి ఉన్న అభ్యర్థులు

సంగ్రామంలో సయోధ్యకు..

'ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లు'గా పంచాయతీ ఎన్నికలు ఆయా పార్టీల ముఖ్యనేతలకు తలనొప్పిగా మారాయి. సర్పంచ్‌లు, వార్డుసభ్యులుగా నామినేషన్లు వేసిన వారంతా రాజకీయ పార్టీల మద్దతు ఆశిస్తున్నారు. అయితే ఒకే పార్టీ నుంచి ఇద్దరు, ముగ్గురేసి నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఓట్ల చీలిక ఏర్పడి అసలుకే మోసం అవుతుందని భావిస్తున్నారు. ఒక్కరినే బరిలో దించేలా సయోధ్య కుదుర్చుతున్నారు. రేపు ఉపసంహరణ చేసుకోవడానికి గడువు ఉండడంతో ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి.

- పార్టీల మద్దతు కోసం అభ్యర్థుల ఆరాటం
- వీడని పంతం.. రంగంలోకి ముఖ్యనేతలు
- బుజ్జగించలేక ఇబ్బంది పడుతున్న వైనం
- పార్టీ నుంచి ఒక్కరినే దింపే ప్రయత్నం
- ఎన్నికల వేళ మారుస్తున్న కండువాలు
- రేపే తొలివిడత నామినేషన్ల ఉపసంహరణ
- బరిలో నిలిచేదెవరో.. తప్పుకునేదెవరో?
- వేడెక్కిన 'పంచాయతీ' రాజకీయం



సంగారెడ్డి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో తొలి విడత నామినేషన్లు పూర్తికాగా.. రెండో విడత నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత ఎన్నికలు తెరమీదకు రావడంతో ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది. సర్పంచ్, వార్డుసభ్యులుగా గెలిచేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. కొన్నిచోట్ల ఏకగ్రీవాలు కాగా మరికొన్ని గ్రామాల్లోనూ ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. రేపటితో తొలివిడత ఉపసంహరణలు పూర్తయితే పల్లె రాజకీయాలు మరింత వేడెక్కుతాయి.

పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా..

రాజకీయ పార్టీల పరమైన గుర్తులు లేకున్నప్పటికీ పోటీచేసే వారంతా కూడా ఆయా పార్టీల్లో కార్యకర్తలుగా కొనసాగుతున్న వారే. ఈ క్రమంలో తమ పార్టీల మద్దతును

మిగతా 7వ పేజీలో

ఓట్లు చీలుతాయని నచ్చజెపుతున్నారు

చాలా గ్రామాల్లో ఒకేపార్టీ నుంచి ఇద్దరు, ముగ్గురు నామినేషన్లు వేశారు. ఓట్లు చీలుతాయనే కారణంగా ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు వారిని తమ వద్దకు రప్పించుకొని సయోధ్య కుదుర్చుతున్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ టికెట్లు ఇస్తామని ఆశ చూపిస్తున్నారు. ఒక్కరే బరిలో ఉంటే పార్టీ గెలుపు సులువవుతుందని నచ్చజెప్తున్నారు. కొందరు ముఖ్యనేతల కంటపడకుండా, వారిని కలవకుండా తిరుగుతున్నారు. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో చిత్తశుద్ధితో పని చేశామని తమకే సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి హెచ్చరికలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నష్టం చేకూరుస్తాయని భావిస్తూ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు తలలు పట్టుకుంటున్నారు. సాధ్యమైనంత వరకు బతిమిలాడే ప్రయత్నం చేస్తున్నారు. నేడు, రేపు సాయంత్రం 5 గంటల దాకా తొలివిడత నామినేషన్ల ఉపసంహరణ ముగిసేదాకా ఇటు నేతలకు, అటు అభ్యర్థులకు టెన్షన్ తప్పేట్లు లేదు.

ముగిసిన తొలివిడత అభ్యంతరాల సేకరణ

- నేడు అప్పీళ్లకు పరిష్కారం.. నేడు, రేపు నామినేషన్ల ఉపసంహరణ

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తొలివిడత నామినేషన్లపై సోమవారం అభ్యంతరాల సేకరించారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని క్లస్టర్ల వారీగా ఏర్పాటు చేసిన ఆయా నామినేషన్ల కేంద్రాల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు అభ్యంతరాలను స్వీకరించారు. సంగారెడ్డి డివిజన్ పరిధిలో ఉన్న సంగారెడ్డి, కంది, కొండాపూర్, సదాశివపేట, పటాన్ చెరు, గుమ్మడిదల, హత్నూర మండలాల్లో సదాశివపేట మండలం తంగెడపల్లి సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన తలారి నర్సింలు నామినేషన్‌పై అభ్యంతరం వచ్చింది. కాగా హత్నూర మండలంలో రెండు, కంది మండలంలో ఒక గ్రామ పంచాయతీల పాలకవర్గాలు ఏకగ్రీవమైన విషయం తెలిసిందే. అభ్యంతరాలను నేడు పరిష్కరించనున్నారు. ఈ నెల 3 వరకు నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఉన్నది. ఉపసంహరణ అనంతరం బరిలో ఎంతమంది ఉంటారో తేలనున్నది.

రూ.25 లక్షల వరకు వేలం

ఖానాపూర్(కె)లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వాయిదా

కల్హేర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన మద్దతుదారులు సర్పంచ్ పదవి కోసం రూ.25 లక్షల వరకు వేలం పాడినట్లు తెలిసింది. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలోని ఖానాపూర్(కె) గ్రామ సర్పంచ్ పదవి ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో సోమవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ పదవి కోసం వేలం నిర్వహించగా బీఆర్ఎస్ అభ్యర్థి రూ.22.20 లక్షల వరకు, బీజేపీ అభ్యర్థి రూ.25 లక్షలకు వేలం పాడినట్లు తెలిసింది. వారిలో ఒకరు గతంలో బెల్టుషాపును నిర్వహించడానికి గ్రామానికి రూ.6 లక్షలు చెల్లించడానికి ఒప్పుకుని సక్రమంగా ఇవ్వలేదని, సర్పంచ్ పదవి వేలం డబ్బు కూడా చెల్లించవంటూ సభలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తల మధ్య బెల్టుషాపు విషయమై మాటా, మాటా పెరిగిందని, దీంతో వేలం పాట వాయిదా వేసుకున్నట్లు సమాచారం. ఈ గ్రామ పంచాయతీ నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యేలు ఎం.భూపాల్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి సొంతూరు కావడం విశేషం.

కేంద్రాల వద్ద రద్దీపై మెదక్ కలెక్టర్ ఆగ్రహం



చేగుంట: అధికారులకు సూచనలిస్తున్న మెదక్ కలెక్టర్

చేగుంట/మెదక్ అర్బన్/కల్హేరల్/చిన్నశంకరంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చేగుంటలో నామినేషన్ కౌంటర్లను మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. కౌంటర్ల వద్ద భారీగా జనాలు గుమిగూడటంపై అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్ కౌంటర్లలో క్రమ సంఖ్య పద్ధతిలో టోకెన్లు జారీ చేసి, అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేసి, జనం గుమిగూడకుండా చూడాలని ఆదేశించారు. అంతేకాకుండా కలెక్టర్ జిల్లాలోని మెదక్ ఎంపీడీవో కార్యాలయంలోని కేంద్రంను పరిశీలించారు. చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలోని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్, ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. వారి వెంట డీపీవో యాదయ్య, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, ఎంపీడీవోలు, రిటర్నింగ్ అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్ఐ నారాయణ తదితరులు ఉన్నారు. మెదక్ కలెక్టరేట్‌లో స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని సూచనలు చేశారు. మాస్టర్ ట్రైనర్ జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్వోల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు.

ఇష్టారీతిన గోదాముల నిర్మాణాలు

- ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీకి రూ.కోట్ల ఆదాయానికి గండి!
- నాయకుల హుకుంకు తలొగ్గుతున్న అధికారులు
- టాస్క్‌ఫోర్స్ ఉన్నా చర్యలు శూన్యం

ఐడీఏ బొల్లారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలో అక్రమ గోదాముల నిర్మాణాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. స్థానిక నాయకుల ప్రాబల్యం పెరిగిపోవడం, వారి జోక్యంతో 'ఇచ్చింది తీసుకో, చెప్పిన కాడ సంతకం పెట్టు' అంటూ అధికారులపై హుకుం జారీ చేయడం వల్ల కోట్లాది రూపాయల మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోంది. నియంత్రించాల్సిన మున్సిపల్ అధికారులు చేష్టలుడిగి ఉండిపోవడమే కాక, జిల్లా అధికారులకు సైతం సమాచారం ఇవ్వకుండా అందినకాడికి దండుకుంటున్నారు.



ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడలో గోదాము షెడ్ల నిర్మాణం

అసెస్‌మెంట్ పేరుతో అక్రమాలు

దాదాపు మూడు వందల పరిశ్రమలున్న ఈ పారిశ్రామికవాడలో దశాబ్దాలుగా ఉన్న అనేక కంపెనీలు మూతపడి ప్రస్తుతం గోదాములుగా మారుతున్నాయి. ఎకరం, రెండు ఎకరాల విస్తీర్ణంలో గోదాములను పూర్తిగా రేకులతో నిర్మిస్తున్నారు. వాస్తవానికి, గోదాముల నిర్మాణం లేదా ఇతర వాణిజ్య సముదాయాలకు అనుమతులు ఇచ్చే అధికారం మున్సిపలిటీకు లేదు. అయినప్పటికీ, వసూళ్లే లక్ష్యంగా పనిచేస్తున్న అధికారులు, పరిశ్రమలకు ఉన్న పాత ఇంటి నంబర్ల ఆధారంగా అసెస్‌మెంట్ చేస్తున్నారు. చట్టంలోని చిన్నపాటి సదుపాయాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటూ, అనుమతులు లేకుండా జరిగిన నిర్మాణాలకు వంద శాతం జరిమానా విధించినట్టు చూపిస్తూ అనుమతులు మంజూరు చేస్తున్నారు. నాయకులతో సమాంతరంగా అధికారులు వాటాదారులుగా మారుతున్నారు.

రూ.80 లక్షల ఫీజుకు బదులు రూ.6 లక్షలే

అక్రమంగా అనుమతులు మంజూరు చేయడం ద్వారా మున్సిపాలిటీకి, హెచ్‌ఎండీఏకు భారీగా నష్టం వాటిల్లుతోంది. ఉదాహరణకు... 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణం నిర్మాణానికి నిబంధనల ప్రకారం మున్సిపాలిటీకి దాదాపు రూ. 80 లక్షలు ఆదాయం రావాల్సి ఉండగా, అధికారులు కేవలం రూ.6 లక్షలు మాత్రమే తీసుకొని అనుమతులు మంజూరు చేస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. ఈ విధంగా ఇప్పటికే 60కి పైగా గోదాములకు ఇంటి నంబర్ల ఆధారంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి.

టాస్క్‌ఫోర్స్ కమిటీ ఎక్కడ?

అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు స్పందించకపోతే జిల్లా స్థాయిలో స్పందించేందుకు గత కలెక్టర్ హయాంలో టీఎస్‌బీ పాస్ 2020 యాక్ట్ 12కు లోబడి డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్) కమిటీని ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, రోడ్లు భవనాల శాఖ అధికారులతో కూడిన ఈ కమిటీలో సంగారెడ్డి ఆర్డీవో, సీఐ, పటాన్‌చెరు అగ్నిమాపక శాఖ అధికారి, రోడ్లు భవనాల శాఖ డీఈలు సభ్యులుగా ఉన్నారు. అయినప్పటికీ, గోదాముల వ్యవహారంలో అక్రమంగా జరిగిన నిర్మాణాలను కూల్చివేయడానికి సహకారం అందించాలంటూ మున్సిపల్ కమిషనర్ కిషన్ రాసిన లేఖకు ఆర్డీవో రాజేందర్ స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీ తమ విధులను ఒక్కసారి కూడా వినియోగించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదును పెంచాలి

- విద్యాశాఖ ఆర్జేడీ విజయలక్ష్మి



కంది పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న విజయలక్ష్మి

కంది, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యాసంవత్సరానికి ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదును పెంచాలని విద్యాశాఖ ఆర్జేడీ (రీజనల్ జాయింట్ డైరెక్టర్) సూచించారు. సోమవారం ఆమె కందిలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, పాఠశాల ఆవరణను తనిఖీ చేశారు. విద్యార్థులు హాజరు శాతం, పరిశుభ్రత చూసి ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణిని అభినందించారు. అనంతరం బోధన పద్ధతులపై విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. పాఠ్యాంశాల గురించి విద్యార్థులను తెలుగులో, ఇంగ్లీషులో మాట్లాడించి ఆమె సంతృప్తి వ్యక్తంచేశారు. పాఠశాలల్లో మిగిలి ఉన్న పనులు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.



టైర్ పేలి పల్టీ కొట్టిన తుపాన్

● పలువురికి గాయాలు, ఐదుగురి పరిస్థితి విషమం



హుగ్గెలి వద్ద డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టిన తుపాన్ వాహనం

జహీరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : టైర్ పేలి తుపాన్ వాహనం పల్టీ కొట్టిన సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి వద్ద జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకున్నది. కర్ణాటకలోని బౌరద్ నుంచి హైదారాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇందులో ప్రయాణిస్తున్న నలుగురు చిన్నారులతో సహా పదిమందికి గాయాలయ్యాయి. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న ఐదుగురిని హైదరాబాద్‌కు తరలించారు.

ఆగని అక్రమ నిర్మాణాలు

● ప్రత్యేక పాలనలో నిబంధనల పాతర

సదాశివపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అధికారుల పాలనలో సదాశివపేట బల్దియాలో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. బల్దియా ఉన్నతాధికారి దీర్ఘకాలిక సెలవుల్లో ఉండడంతో పట్టణంలో ప్రత్యేక పాలన గాడి తప్పిపోతున్నది. ఇదే అదునుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. పట్టణంలోని 26 వార్డుల్లో ఎటుచూసినా అక్రమ నిర్మాణాలే దర్శనమిస్తున్నారు. పట్టణంలో 65వ జాతీయ రహదారి పక్కన ఉన్న వందల కోట్ల విలువైన ప్రభుత్వ (కందకం) స్థలంలో ఎలాంటి నిర్మాణాలు జరపరాదని హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. సంబంధిత టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు హైకోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నట్టు బలమైన ఆరోపణలున్నాయి. 2020 మాస్టర్‌ప్లాన్ ప్రకారం నిర్దేశిత రెసిడెన్షియల్, ఇండస్ట్రియల్, గ్రీన్‌జోన్ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య దుకాణ సముదాయాలు, బహుళ అంతస్థుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాల్లో యథేచ్ఛగా అక్రమ భవన నిర్మాణాలు చకచకగా ముందుకు సాగుతున్నాయి. ఇదే సమయంలో అక్రమ వెంచర్లు పుట్టగొడుల్లా వెలుస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయి. పట్టణంలో ప్రధానంగా 65వ నెంబరు జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ (కందకం) స్థలంలో తాత్కాలికమైన భారీ రేకుల షెడ్లు, భారీ కమర్షియల్ భవనాల నిర్మాణాలు బహిరంగంగా నిర్మిస్తున్నప్పటికీ ఇటువైపు ఏ ప్రభుత్వ శాఖల అధికారులు కన్నెత్తి చూడకపోవడం పట్ల అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. పట్టణంలో ఓ పాఠశాలకు సమీపంలో ప్రభుత్వ (కందకం) స్థలంలో కొత్తగా ఓ వైన్స్‌షాపు నిర్వహణ కోసం తాత్కాలిక షెడ్డును నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారి పట్టించుకుని అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పట్టణంలో ప్రభుత్వ కందకం స్థలంలో ఓ భారీ అక్రమ నిర్మాణం

సిగాచి బాధిత కుటుంబాలకు పరిహారంపై నిర్లక్ష్యమెందుకు?

● బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సిగాచి బాధిత కుటుంబాలకు పరిహారం అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యమెందుకు వహిస్తున్నదని సంగారెడ్డి ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు ప్రశ్నించారు. సంగారెడ్డిలో కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ఆగమేఘాల మీద సీఎం రేవంత్‌రెడ్డి సిగాచి పరిశ్రమలో పేలుడు జరిగిన సమయంలో బాధితులకు రూ.కోటి ఇస్తామని చెప్పి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. సిగాచి ఘటనలో మృతిచెందిన కుటుంబాలకు పరిశ్రమ నుంచి రూ.25 లక్షలు, ప్రభుత్వం నుంచి రూ.లక్ష మాత్రమే చెల్లించారని, మిగతా పరిహారం కోసం బాధిత కుటుంబాలు కళ్లలో వత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారని అన్నారు. వెంటనే ప్రకటించిన పరిహారం చెల్లించి బాధిత కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ సిగాచి పరిశ్రమల బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తామని చెప్పిన రూ.2 లక్షల నష్టపరిహారం కూడా ఇంతవరకు అందలేదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ డీసీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, నాయకులు గడీల శ్రీకాంత్‌గౌడ్, మోహిజ్‌ఖాన్, ఆర్.వెంకటేశ్వర్లు ఉన్నారు.



కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు

అక్రమంగా పశువుల రవాణా

● పట్టుకున్న బీజేపీ, గోరక్షణ కమిటీ నాయకులు



నర్సాపూర్ చౌరస్తాలో పశువులను తరలిస్తున్న లారీని అడ్డుకుంటున్న బీజేపీ, గోరక్షణ కమిటీ నాయకులు


నర్సాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఓ లారీలో అక్రమంగా పశువులను తరలిస్తున్నట్లు గుర్తించిన గోరక్షణ కమిటీ ప్రతినిధులతో పాటు బీజేపీ నాయకులు నర్సాపూర్ చౌరస్తాలో అడ్డుకుని పోలీసులకు సోమవారం అప్పగించారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు ఓ లారీలో ఆవులు, ఎద్దులను 25 వరకు లారీలో నిబంధనలకు విరుద్ధంగా కుక్కి తరలిస్తున్నారని గుర్తించి నర్సాపూర్ ప్రధాన చౌరస్తా ఆ లారీని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఆపకుండా వెళ్లే ప్రయత్నం చేయడంతో లారీలో ఉన్నవారిపై దాడికి ఉపక్రమించగా.. కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సీఐ జాన్‌రెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకుని నచ్చచెప్పి లారీని జూనియర్ కాలేజీ మైదానానికి తరలించారు. అందులోని ఆవులను, ఎద్దులను జియాగూడలోని గోశాలకు తరలించి సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు. లారీని అడ్డుకున్న వారితో ఏఎస్ఐ దురుసుగా వ్యవహరించాడంటూ బీజేపీ నాయకులు కొద్దిసేపు సీఐతో వాగ్వివాదానికి దిగారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వి.మల్లేశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు

మర్కుక్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మర్కుక్ మండలం దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య ప్రఖ్యాత ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యారని ఎంఈవో వెంకటరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 డిసెంబరు 6 నుంచి 9 వరకు హర్యానాలోని పంచకుల క్యాంపస్‌లో నిర్వహించనున్న ఎడ్యుకేషన్ ఫర్ అస్పైరింగ్ ఇండియా సైన్స్ సఫారీ గేమ్స్ అండ్ అడ్వెంచర్స్ వర్క్‌షాప్‌కు ప్రతినిధిగా మర్కుక్ మండలం నుంచి వెళ్లడం సంతోషంగా ఉందని ఎంఈవో ఆశాభావం వ్యక్తం చేశారు. బోధనల కొత్త పద్ధతులు, వినూత్న ఆలోచనలు ప్రయోగిక ఆవిష్కరణలను ఆయన ప్రదర్శించనున్నారన్నారు.







హెచ్‌ఐవీతో జీవించే వారిని ఆదరించాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీతో జీవించే వారిని ఆదరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య సూచించారు. వరల్డ్ ఎయిడ్స్ డేను పురస్కరించుకొని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డిలోని జీజీహెచ్ నుంచి డీఎంహెచ్‌వో ఆఫీస్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజలందరూ హెచ్‌ఐవీ వైరస్ పట్ల అవగాహన కలిగి ఉండాలని, ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. లక్షణాలు, అనుమానాలు ఉన్నట్లైయితే సర్కారు దవాఖానాల్లో నిర్ధారణ పరీక్షలు చేసుకోని చికిత్స పొందాలని సూచించారు. అనంతరం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల విజేతలతో పాటు ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఐవో డా.శశాంక్, టీబీ పీవో డా.అరుణకుమారి, డీపీసీయూ సిబ్బంది నాగరాజు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సంగారెడ్డిలో సిబ్బందికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న సౌజన్య

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి : డీఎస్పీ

మెదక్ అర్బన్/హవేళిఘణపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేయాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో, హవేళిఘణపూర్ మండలంలోని గాజిరెడ్డిపల్లి గ్రామంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని, గ్రామాల్లో గొడవలు, గ్రూపు తగాదాలు, ఉద్రిక్తతలకు దారితీసే చర్యలు పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరినైనా బెదిరించి ఓటు వేయమని ఒత్తిడి చేయడం నేరమని, డబ్బు, మద్యం, ఉచితాలు ఇచ్చి ఓటర్లను ప్రభావితం చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎన్నికల సమయంలో మద్యం నిల్వ, పంపిణీ, వినియోగం కనిపిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రంలో సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. సోషల్ మీడియాలో పుకార్లు, నకిలీ వార్తలు షేర్ చేయడం ప్రమాదకరమన్నారు. వారిపై నిఘా ఉంటుందన్నారు.



గాజిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

కాళ్లకల్ వద్ద నగదు పట్టివేత

మనోహరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల వేళ నగదు పట్టుకున్న సంఘటన మండల పరిధిలో కాళ్లకల్ శివారులో 44వ జాతీయ రహదారి వద్ద చోటు చేసుకుంది. సోమవారం సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్ కాళ్లకాల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కూచారం గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ బైక్‌ను పరిశీలించగా.. అతని వద్ద రూ.5 లక్షలు లభ్యం కావడంతో సీజ్‌చేసి తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డికి అప్పగించారు. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా అక్రమ రవాణా, అనధికార నగదు ఉల్లంఘనలను నిరోధించేందుకు తనిఖీలు కొనసాగుతాయని సీఐ రంగాకృష్ణ తెలిపారు.



పట్టుకున్న నగదును చూపుతున్న పోలీసులు

మత్స్యకారులు అభివృద్ధి చెందాలి

వెల్దుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా మత్స్యశాఖ అధికారి సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం వెల్దుర్తిలోని కుడి చెరువులో 3 లక్షల 70 వేలు, దేవతల చెరువులో 3 లక్షల 70 వేల చేప పిల్లలను విడుదల చేసి మాట్లాడారు. వెల్దుర్తి మండలంలోని చెరువులో 7 లక్షల 40 వేల చేప పిల్లలను విడుదల చేశామని దీంతో మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బాలరాజ్, కార్యదర్శి అశోక్, రోశాధికారి శ్రీనివాస్, సోసైటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న అధికారులు

సర్పంచ్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలవడం ఖాయం

● నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి



నర్సాపూర్ మండలం రుస్తుంపేటకు చెందిన మాజీ వార్డుసభ్యులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువకప్పి చేర్చుకుంటున్న రాజిరెడ్డి

నర్సాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ ఎన్నికల్లో నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మద్దతుదారులు అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నర్సాపూర్ మండల రుస్తుంపేటకు చెందిన బీఆర్ఎస్, బీజేపీకి చెందిన మాజీ వార్డుసభ్యులు పోచయ్య, శ్రీశైలం, కొల్చారం మండలం రంగంపేటకు చెందిన బీఆర్ఎస్ శాఖ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ, శివ్వంపేట మండలం పొంబండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆవుల రాజిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువా కప్పి చేర్చుకున్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం అవలంభిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజాపాలనే సర్పంచ్ ఎన్నికల్లో గెలుపునకు సోపానాలవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, మాజీ సర్పంచ్ అశోక్, యువజన నాయకుడు సుధీర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

● ఖాతాల కోసం పాట్లు



పోస్టాఫీస్ ఖాతాల కోసం కోహీర్‌లోని పోస్టాఫీస్ వద్ద వేచి ఉన్న అభ్యర్థులు

కోహీర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్, వార్డుసభ్యుల అభ్యర్థులకు నామినేషన్ పత్రంతో జీరో అకౌంట్‌కు సంబంధించి బ్యాంకు లేదా పోస్టాఫీస్ ఖాతా అవసరమనే నిబంధన ఉండడంతో జీరో అకౌంట్ లేని అభ్యర్థులు ఆయా బ్యాంకుల వద్ద పోస్టాఫీస్‌ల వద్ద నిరీక్షిస్తున్నారు. అన్ని పత్రాలు ఉన్నా బ్యాంకు ఖాతాలు లేకపోవడంతో బ్యాంకులు, పోస్టాఫీసులకు ఎగబడ్డారు. సోమవారం కోహీర్‌లోని పోస్టాఫీస్ వద్ద చాలామంది సర్పంచ్, వార్డుసభ్యుల అభ్యర్థులు నిరీక్షించారు.

● మొబైల్ వెలుతురు చాలు



తూప్రాన్ ఎంపీపీ కార్యాలయంలో మొబైల్ వెలుతురులో రసీదు పంపిణీ చేస్తున్న దృశ్యం

తూప్రాన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ ఐడీవోసీ భవనంలో సోమవారం నామినేషన్లు వేసేందుకు సర్పంచ్, వార్డుసభ్యుల అభ్యర్థులు విచ్చేశారు. పంచాయతీలో పోటీచేసే అభ్యర్థులు పన్ను బకాయిలు ఉండరాదన్న నిబంధనతో పన్నుల చెల్లింపులు చేపట్టారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాగులపల్లికి చెందిన అభ్యర్థులు పన్ను చెల్లింపులు చేసేందుకు విచ్చేయగా, కార్యదర్శి సంతోష్‌కుమార్ మొబైల్ ఫోన్ వెలుతురులో పన్నులు పొంది రసీదులు అందజేశారు.

● జిరాక్స్ సెంటర్ల జోరు..



నర్సాపూర్‌లో జిరాక్సు సెంటర్ వద్ద బారులుతీరిన అభ్యర్థులు

నర్సాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల సందడి నెలకొన్నది. పోటీలో ఉండాలంటే అందుకు సంబంధించిన కుల ధ్రువీకరణపత్రంతో పాటు ఇతర పత్రాలు జతచేయాల్సి ఉంటుంది. నర్సాపూర్ మండలంలో మూడోవిడత నామినేషన్ల ప్రక్రియ 3 నుంచి ప్రారంభంకానుండటంతో పత్రాలన్నీ సిద్ధం చేసుకునేందుకు పోటీలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో నర్సాపూర్ మండల కార్యాలయం వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్ వద్దకొచ్చి పత్రాలు తీసుకుంటున్నారు.

ఊరు మంచి గుండాలే..

● పల్లెల్లో వేడెక్కిన రాజకీయాలు



దౌల్తాబాద్, డిసెంబర 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నామినేషన్లు మొదలుకావడంతో గ్రామాల్లో కోలాహలం మొదలైంది. ఊళ్లలో వాతావరణం వేడిగా మారింది. తమ వాడినే గెలిపించుకుంటామని ఒకవర్గం.. మా కాలనీ పెద్దనే సర్పంచ్ చేస్తామంటూ మరో వర్గం గ్రామాల్లో మాటల తూటాలు పేలుతున్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఊర్లో వీధి అరుగుల వద్ద, చాయ్ హోటల్ వద్ద, పెద్ద మనుషులు మాట్లాడుకుంటున్న ముచ్చట చూద్దాం..

రామయ్య: అదే నరసన్న ఎటు పోతున్నవే. ఇటు రాయే. ఓ చాయ్ తాగుదువుగానీ..

నర్సయ్య : ఓ రామన్న వత్తాన్న.. వత్తాన్న. ఓ చాయ్ అయితే చెప్పే మల్లన్న.

రామయ్య: (హోటల్ యజమానితో) నర్సయ్యకు చాయ్ ఇవ్వవే...

నర్సయ్య : మల్లన్న ఊళ్లే ఏం అనుకుంటున్నరే.. (చాయ్ తాగుతూ..). సర్పంచ్ ఎలచ్చన్లు కదా.. పడుచు పోరగాండ్లు ఉడుకు రక్తంతో ఆగుతలేరే.

మల్లయ్య: అవునే నరసన్న.. పోరగాండ్లు ఆగుతలేరు. మనప్పుడు గిట్ల లేదే. గప్పుడు పెద్ద మనుషులకు మర్యాద ఇచ్చేవాళ్లం. ఇప్పుడు చుట్టపోన్ని కూడా చూత్తలే. అక్క, తమ్ముడు అనే బంధమే లేదు. ఎలచ్చన్ల ఎట్ల గెల్వాలనే చూత్తుండ్రు. చిన్న పెద్ద... అని చూత్తలేరు.

నర్సయ్య : అవునే రామన్న. మా కులపోడిని గెలిపించుకుంటామని మీది వాడ కట్టోళ్లు.. మా గల్లీ లీడర్‌ను గెలిపించుకోవాలని కింది వాడకట్టోళ్లు తిరుగుతుండ్రే.

రామయ్య: అవునే.. మొన్నటి దాక ఈల్లందరు కలిసే తిరిగిండ్రు. గిప్పుడు గీ ఊళ్లే ఎలచ్చన్లు అనుడుతోనే ఎవనోన్ని వాడు గెలిపించుకుంటామంటూ మురాలు కట్టిండ్రు. లడాయిలు కూడా పెట్టుకుంటుండ్రు.

నర్సయ్య : ఎవనికి వాడే.. మా కులపోడు.. మా గల్లోడు అంటూ గ్రూపులు కడుతుండ్రే. గిప్పుడు ఊళ్లే ఐదారు గ్రూపులైనై. పొద్దుగాల చాయ్. టిఫిన్, రాత్రైతే మందు లొల్లి.

రామయ్య: ఏమోనే.. గీ ఎలచ్చన్లు ఎట్ల అయిపోతయే. ఏ లడాయి లేకుండా ఎప్పటోలే ఊరు మంచిగుండాలనే నరసన్న.

నర్సయ్య: అవునే.. అందరికీ అదే మంచిది. మంచి గుండాలనుకుందాం. పోయ్యత్తనే రామన్న.

రామయ్య: సరేనే నరసన్న. నేను ఇంటి దిక్కుపోతా. పొద్దుగూకుతోంది.. ఇలా ఇద్దరు మిత్రులు హోటల్లో గరంగరం చాయ్ తాగి, సాయంత్రం కావడంతో వాళ్ల ఇళ్లకు వెళ్లిపోయారు.

సర్పంచుల కుటుంబం

తల్లిదండ్రులు, కుమారుడు..

- నాలుగు దఫాలుగా విజయ దుందుభి
- పల్లె నుంచి ఢిల్లీ దాకా పాకిన తోపుగొండ ప్రగతి
- దివంగత రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నుంచి అవార్డు
- ఆదర్శంగా గ్రామపంచాయతీ



కంది, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ ఎన్నికల్లో ఎన్నెన్నో చిత్ర విచిత్రాలు చరిత్రలో నమోదవుతుంటాయి. జీవితంలో ఒక్కసారి సర్పంచ్ కావడానికి లెక్కలేనన్నీ ప్రయత్నాలు చేస్తున్న రోజులు. అయితే ఒకే కుటుంబం నుంచి ముగ్గురు సర్పంచులుగా ఎన్నికై చరిత్రలో నిలిచారు. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని తోపుగొండ గ్రామానికి చెందిన చెంగల్ నరోత్తంరెడ్డి రెండుసార్లు, ఆయన సతీమణి చెంగల్ మణెమ్మ ఒకసారి, వారి కుమారుడు చెంగల్ గోపాల్‌రెడ్డి ఒకసారి ముగ్గురు అదే గ్రామానికి సర్పంచులుగా ఎన్నికై చరిత్రలో నిలిచారు. అంతేగాక గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపినందుకు 2005లో చెంగల్ నరోత్తంరెడ్డికి ఉత్తమ సర్పంచ్ అవార్డు లభించింది. గ్రామంలో మెరుగైన పాలన, స్వయం సమృద్ధి, స్వచ్ఛత, మహిళా సాధికారతకు అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నుంచి 'నిర్మల్ గ్రామ పురస్కారం' అందుకున్నారు

మండలంలోనే లేరు

కంది మండలంలోనే కాదు సంగారెడ్డి పాత తాలూకా పరిధిలో ఒకే కుటుంబం నుంచి ముగ్గురు సర్పంచులుగా ఎన్నికైనవారు ఇప్పటివరకైతే ఎవరూ లేరు. చెంగల్ నరోత్తంరెడ్డి 1989-97 ఒకసారి, 2001-06 వరకు రెండు దఫాలుగా సర్పంచ్‌గా సేవలందించి ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు తీసుకున్నారు. అనంతరం 2006-11 వరకు ఆయన సతీమణి మణెమ్మ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. తరువాత వారి కుమారుడు చెంగల్ గోపాల్‌రెడ్డి 2019-24లో సర్పంచ్‌గా గెలిచి పచ్చదనం పరిశుభ్రతలో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డును అందుకున్నారు.

ఢిల్లీ దాకా గ్రామ ప్రగతి..

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధి సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఓ మారుమూల గ్రామమైన తోపుగొండ ప్రగతి ఢిల్లీ దాకా పాకటం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. 1,050 మంది గ్రామస్థులు 750 మంది ఓటర్లు ఉన్న తోపుగొండ ఊరు సర్పంచ్ నరోత్తంరెడ్డి ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకునే వారని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో నీటి సమస్యలు లేకుండా చూడడం, గ్రామస్థులకు చేదోడు వాదోడుగా ఉండడం, గ్రామం మొత్తం అభివృద్ధి జరగడంతో ఓటర్లు మళ్లీ మళ్లీ ఆ కుటుంబానికే పట్టం కట్టారు. ఈ విషయం అధికారుల ద్వారా జిల్లాస్థాయిలో తోపుగొండ పేరు మార్మోగింది. దీంతో అప్పటి పంచాయతీ ఉన్నతాధికారుల సహకారంతో జాతీయస్థాయిలో తోపుగొండకు పేరు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తోపుగొండకు 'నిర్మల్ గ్రామ పురస్కారం' ప్రకటించింది. దీంతో నరోత్తం రెడ్డి స్వయంగా ఢిల్లీకి వెళ్లి అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం నుంచి అవార్డును అందుకున్నారు.



దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నుంచి ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు అందుకుంటున్న నరోత్తంరెడ్డి(ఫైల్)

సంఘ భవనం పూర్తికి హామీ.. మద్దతిచ్చిన ఊరు

● దమ్మక్కపల్లిలో ఒక్కరికే మద్దతు

తూప్రాన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అసంపూర్తిగా నిలిచిపోయిన సంఘ భవనం పూర్తి చేసేందుకు ముందుకొచ్చిన వ్యక్తికే ఊరంతా మద్దతిచ్చిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఘనపూర్ పంచాయతీ పరిధి దమ్మక్కపల్లిలో సోమవారం చోటు చేసుకున్నది. ఘనపూర్ గ్రామపంచాయతీ పరిధిలో అమ్లేట్ గ్రామంగా 10వ వార్డు దమ్మక్కపల్లి గ్రామముంది. ఇక్కడ ముదిరాజ్ కులస్తులు మాత్రమే ఉన్నారు. గ్రామంలో కుల సంఘ భవన నిర్మాణం చేపట్టగా స్లాబులు, ప్రహరీ నిర్మించి వదిలివేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల సమయంలో కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తి చేసుకోవాలని నిర్ణయించారు. అందుకు గ్రామస్థులు సోమవారం మధ్యాహ్నం సమావేశం ఏర్పాటు చేసుకోగా, చీల ముత్యాలు అత్యధికంగా రూ.8.50 లక్షలు అందజేస్తానంటూ చెప్పాడు. పూర్తయ్యే వరకు డబ్బంతా ఖర్చు చేస్తానంటూ హామీఇచ్చాడు. మరో వ్యక్తి బర్ల ఆంజనేయులు రూ.8.20 లక్షలు చెల్లించేందుకు ముందుకు రాగా, ముత్యాలుకే గ్రామస్థులు జైకొట్టారు. మంగళవారం ముత్యాలుతో నామినేషన్ వేయించనున్నారు.

పీర్లతండాలో రెండువార్డులు ఏకగ్రీవం

నారాయణఖేడ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పీర్లతండాలో రెండు వార్డుల్లో ఏకగ్రీవంగా వార్డుసభ్యులను ఎన్నుకోవడానికి ఆ వార్డులకు సంబంధించిన వారు తీర్మానం చేసుకున్నారు. పీర్లతండా పంచాయతీ పరిధిలో కిందితండా కూడా ఉంది. పీర్లతండాలో మొత్తం 8 వార్డులు, 988 మంది ఓటర్లు ఉన్నారు. ఈనెల 5 వరకు నామినేషన్ల పర్వం కొనసాగనుండడంతో, సోమవారం తండావాసులు సమావేశమై కిందితండాకు సంబంధించి 1వ వార్డు నుంచి భక్తిరాంచౌహాన్, 2వ వార్డుకు రాథోడ్ ఉమ్లానాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి తీర్మానించుకుని, వారిని సన్మానించారు. పీర్లతండా పరిధిలో 8 వార్డులకు రెండు వార్డులు ఏకగ్రీవం కానున్నాయి.

జూక్కల్‌లో విచిత్రం

● ఓటర్లు లేకపోయినా వార్డు రిజర్వు

నారాయణఖేడ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జూక్కల్ గ్రామపంచాయతీలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. జూక్కల్ గ్రామపంచాయతీ పరిధిలో 8 వార్డులు, 862 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1వ వార్డును ఎస్టీ జనరల్‌కు, 6వ వార్డును ఎస్టీ మహిళకు రిజర్వు చేశారు. మొదటి వార్డులో ఎస్టీ ఓటర్లు అసలు లేకపోవడంతో ఆ వార్డు నుంచి ఎవరు పోటీచేయాలో తెలియ గ్రామస్థులు సతమతమవుతున్నారు. గిరిజన ఓటర్లు లేకపోయినా 1వ వార్డును అధికారులు గిరిజనులకు రిజర్వు చేయడం ఏమిటని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వార్డులో ఆ సామాజికవర్గమే లేదు

దుబ్బాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతరెడ్డిపేటలో విచిత్ర పరిస్థితి ఏర్పడింది. 2 వేల 66 ఓట్లున్న ఆ గ్రామంలో 10 వార్డులున్నాయి. సర్పంచ్‌గా ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. వార్డులో రిజర్వేషన్ చేయగా, 4 ఓసీ రిజర్వేషన్లు, రెండేసీ మహిళా, పురుషులకు, బీసీ మహిళా, బీసీ జనరల్ పురుషులుగా రిజర్వేషన్ కేటాయించారు. ఆదే గ్రామంలో మరో నాలుగు ఎస్సీ మహిళా, పురుషులకు రెండేసీగా కేటాయించారు. అయితే 2వ వార్డులో మొత్తం బీసీ సామాజిక వర్గం మాత్రమే ఉంటుంది. ఆ వార్డు ఎస్సీ జనరల్ రిజర్వు కావడంతో పక్క వార్డులోని వ్యక్తులు వచ్చి, ఆ వార్డులో నామినేషన్ వేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ వార్డులోని ఓటరు ప్రతిపాదిస్తే, పక్కవార్డు ఓటరు నామినేషన్ వేయక తప్పడం లేదు.

ఇక్కడ ఇంకా కోడ్ కూయలేదా..



పీరాపూర్‌లో ముసుగు వేయకుండా ఉన్న శిలాఫలకం

బెజ్జంకి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. కానీ, బెజ్జంకి మండలంలోని చాలా గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం వేసిన శిలాఫలకాలు ప్రధాన రహదారుల వెంట ఉన్నాయి. ఎన్నికల నిబంధన నియమావళి ప్రకారం శిలాఫలకాలు కన్పించకుండా ముసుగు వేయాల్సి ఉంటుంది. కానీ అవేవి పట్టనట్లుగా అధికారులు వదిలేశారు. దీనితో అధికారులు ఎన్నికల కోడ్‌ను పట్టించుకోరా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

52 పంచాయతీల్లో గిరిజనులే పాలకులు



కొండాపూర్ హనుమాన్‌తండా పంచాయతీ

నారాయణఖేడ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ నియోజకవర్గంలో 52 గ్రామ పంచాయతీల్లో గిరిజనులే పాలకులుగా కొనసాగనున్నారు. జిల్లావ్యాప్తంగా 99 గ్రామపంచాయతీలను గిరిజనులకు రిజర్వు చేయగా, అందులో నారాయణఖేడ్ నియోజకవర్గంలోనే 52 గ్రామపంచాయతీల్లో గిరిజనులే ఓటర్లుగా ఉండడంతో వారే పాలకులుగా కొనసాగనున్నారు. జిల్లావ్యాప్తంగా గిరిజన ఓటర్లు 49 వేలు ఉన్నారు. అత్యధికంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలోనే గిరిజన జనాభా అధికంగా ఉంది. 300 జనాభా ఉన్న తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా గుర్తించారు. 300ల కంటే తక్కువగా జనాభా ఉంటే సమీపంలో ఉన్న మరో తండాను కలిపి ప్రత్యేక పంచాయతీగా గుర్తించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని 8 మండలాల్లో 226 గ్రామపంచాయతీ ఉంటే, 52 గ్రామపంచాయతీలు గిరిజనతండాలే. దీంతో ఆయా తండాల్లో గిరిజనులే పాలకులుగా కొనసాగుతారు.

నిజాంపేట మండలంలో సగం గిరిజన తండాలే..

నూతనంగా ఏర్పడిన నారాయణఖేడ్ పరిధిలోని నిజాంపేటలో 18 గ్రామపంచాయతీలు ఉంటే, అందులో 9 గిరిజనతండా పంచాయతీలే ఉన్నాయి. అందులో బల్కంచెల్కతండా, ఈదుల్‌తండా, కల్వలోనికుంట తండా, మాణిక్‌నాయక్‌తండా, మేగ్యానాయక్‌తండా, మోదులకుంటతండా, నాగోనికుంటతండా, రాంచందర్ తండాలు పంచాయతీలుగా ఉన్నాయి.

సర్కారీ కొలువుల తండా

వంద కుటుంబాల్లో 55 మంది ఉద్యోగులు

సర్పంచ్ ఓపెన్ జనరల్‌కు కేటాయింపు

హుస్నాబాద్, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఇది మారుమూ గిరిజన తండా.. ఇక్కడ ఇంటికొక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఉంది. డాక్టర్లు, పోలీసులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. వందకుటుంబాలు ఉన్న ఆ తండాలో 55 మంది ఉద్యోగులు ఉన్నారు. హుస్నాబాద్ మండలంలోని బల్లునాయక్ తండా 2019లో గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఈ తండాలో బీసీ కుటుంబం ఒకటే ఉండగా, సర్పంచ్ రిజర్వేషన్ ఓపెన్ జనరల్‌కు కేటాయించారు. 970 మంది ఓటర్లు ఉండగా, ఇక్కడ మొదటి ఉద్యోగి కిషన్‌నాయక్ (ప్రస్తుతం రిటైర్డు టీచర్). ఉపాధ్యాయులు 18 మంది. డాక్టర్లు 11 మంది (ఇందులో ఒకరు ఎంబీబీఎస్ మినహా మిగతా అందరు



వైద్య నిపుణులు), ప్రభుత్వ ఉద్యోగులు 18 మంది, పోలీసులు ఆరుగురు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇరువురు ఉన్నారు. ఈ తండా నుంచి భూక్య మంగ ఉమ్మడి హుస్నాబాద్ మండలంలో ఎంపీపీగా, మొన్నటి వరకు అక్కన్నపేట జడ్పీటీసీగా ఉన్నారు. ఇదే తండా నుంచి హుస్నాబాద్ ఎంపీపీగా లకావత్ మానస కొనసాగారు. ప్రస్తుత ఎన్నికల్లో ఈ తండా జనరల్‌కు కేటాయించినప్పటికీ ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తే సర్పంచ్ అయ్యే అవకాశం ఉంది.

సంగ్రామంలో సయోధ్యకు

(5వ పేజీ తరువాయి)

కూడగట్టుకుంటున్నారు. ఇక ఈ ఎన్నికలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. బీజేపీ సైతం గత ఎన్నికలతో పోల్చితే కొంత ఉత్సాహంగానే ముందుకెళ్తుంది. రాష్ట్రంలో అధికార పార్టీగా ఉన్నందున కాంగ్రెస్ మద్దతుతో పోటీచేసే వారంతా గెలవాలనే దిశగా ముఖ్యనేతలు పావులు కదుపుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీ సురేశ్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మెదక్ జిల్లాలో మైనంపల్లి హనుమంతరావు, సిద్దిపేట జిల్లాలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిలు రంగంలోకి దిగారు. బీఆర్ఎస్ పార్టీలోనూ మాజీ మంత్రి హరీశ్‌రావు ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలకు దిశానిర్దేశం చేశారు. బీజేపీ తరఫున ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డిలు తమ కార్యకర్తలకు మనోధైర్యం నింపుతున్నారు. ఎవరికివారే ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థుల గెలుపుతో సత్తాచాటాలని వ్యూహరచన చేస్తున్నారు.

ఎన్నికల్లో పదనిసలు

- రాయికోడ్ మండలం పంపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ వెంకట్రావు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ మద్దతుతో వీరి కుటుంబం తరఫున నామినేషన్ దాఖలు చేశారు.
- రాయికోడ్, రేగోడు, మునిపల్లి మండలాల్లో కాంగ్రెస్ నుంచి ఇద్దరు, ముగ్గురు బరిలో నిలిచిన చోట మంత్రి దామోదర్ తన వద్దకు పిలిపించుకుని సయోధ్య కుదుర్చుతున్నారు.
- చిన్నశంకరంపేటలో ఎన్నారై చంద్రశేఖర్ సర్పంచ్‌గా పోటీచేస్తుండడంతో ఆయనను నిలువరించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉమ్మడి అభ్యర్థిని బరిలో దింపాయి.
- నర్సాపూర్ మండలం ఎల్లాపూర్ గ్రామంలో స్వతంత్ర అభ్యర్థిని బీజేపీలో చేర్చుకుని బరిలో నిలుపుతున్నారు.
- పెద్దశంకరంపేటలో తాజామాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణకు కాంగ్రెస్ మద్దతు లభించకపోవడంతో ఆయన బీఆర్ఎస్‌లో చేరారు.
- జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామంలో బీజేపీ మద్దతుతో పోటీ చేస్తున్న మంజ నరసమ్మ బీఆర్ఎస్ మద్దతు కోసం గులాబీ కండువా కప్పుకున్నారు.
- మునిపల్లి మండలం అల్లాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నుంచి ఇద్దరు పోటీ చేస్తుండగా బీఆర్ఎస్‌కు అభ్యర్థి లేరు.
- రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్, ధర్మారం, అక్కన్నపేటలో సర్పంచ్ అభ్యర్థిత్వాల కోసం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు.
- మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌కు చెందిన పురం నవనీత రవి గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లపాటు వివిధ పదవుల్లో కొనసాగి ఇటీవల గజ్వేల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నర్సారెడ్డి ఆధ్వర్యంలో హస్తం కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ తరఫున కాళ్లకల్ సర్పంచ్ రేసులో ఉన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ కృషి

గజ్వేల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ కృషి చేస్తుందని ఏబీవీపీ ఆలిండియా స్టేట్ యూనివర్సిటీస్ కోకన్వీనర్ కమల్ సురేశ్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన ఏబీవీపీ నగర అభ్యాస వర్గ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సామాజిక స్పృహను కలిగి ఉండాలని, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఏబీవీపీ కార్యకర్తలు ఆచరించే జ్ఞానం, శీలం, ఏకత నుంచి ఇతర విద్యార్థులు ప్రేరణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ్ జిల్లా ప్రచారక్ జనార్ధన్‌జీ, సంఘటన మంత్రి లక్ష్మీపతి, ఆదిత్య, పవన్, మహేందర్, గురు, తనూషా, సౌమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమల్ సురేశ్

జీహెచ్‌ఎంసీలో విలీన ఉత్తర్వులు రద్దు చేయాలి

రామచంద్రాపురం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాకు చెందిన తెల్లాపూర్, అమీన్‌పూర్, ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తూ విడుదలైన ఉత్తర్వులను నిలుపుచేయాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి కోరారు. సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, శాసనసభ పక్ష నేత మహేశ్వరరెడ్డితో కలిసి ఎమ్మెల్సీ అంజిరెడ్డి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలుగా ఉన్నవాటిని పట్టణాలుగా మార్చారని వివరించారు. అదే సమయంలో పెరిగిన అన్నిరకాల పన్నులు చెల్లించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇప్పుడు కొత్తగా మున్సిపాలిటీల నుంచి జీహెచ్‌ఎంసీలోకి విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం అన్యాయమని తెలిపారు. జీవనం కష్టంగా మారుతున్న సమయంలో మరిన్ని కష్టాలు తెచ్చేటట్టు ప్రభుత్వం వ్యవహరిస్తోందని వివరించారు. ఐడీఏబొల్లారం విషయంలో పారిశ్రామిక ప్రాంతం కావడం వల్ల 95 శాతం మంది నిరుపేదలు, కార్మికులు 40,60 గజాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్నారని అన్నారు. 95 శాతం మంది కార్మికుల కుటుంబాలు తమ ఇళ్లల్లో రాత్రి సమయాల్లో మాత్రమే ఉంటారని అన్నారు. అటువంటి వారిపై పన్నుల భారం మోపడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సంక్షిప్తం

పుల్కల్‌లో 17 మంది పాత నేరస్థుల బైండోవర్

పుల్‌కల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 17 మంది పాత నేరస్థులను సోమవారం బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ ఎన్. విశ్వజన్ తెలిపారు. ఈ నెల 14న జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్ట్యా బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బస్వాపూర్, శివంపేట తదితర గ్రామాలకు చెందిన పాత నేరస్థులను తహసీల్దార్ కృష్ణ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఎన్నికల నియామవళిని అతిక్రమిస్తే రూ.లక్ష జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని తహసీల్దార్ కృష్ణ పేర్కొన్నారు.

కుటుంబనియంత్రణకు పురుషులు ముందుకు రావాలి

పటాన్‌చెరు డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలు ఉన్నవారు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ విషయంలో పురుషులు ముందుకు రావాలని జిల్లా వైద్యాధికారి వసంతరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన పురుషుల కుటుంబనియంత్రణ శిబిరాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పురుషులకు ప్రత్యేకంగా శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 4వ తేదీన పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేకంగా శిబిరాన్ని నిర్వహించనున్నట్టు వివరించారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి: మెదక్ డీఈవో

హవేళీఘణపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని మెదక్ జిల్లా విద్యాధికారి విజయ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ప్రార్థన సమయంలో ఆమె తనిఖీ చేశారు. తానా ఉత్తర అమెరికా వారి కథల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు నవ్య, కీర్తన, అర్పిత, అదీబా, నవదీప్‌లకు, అలాగే ఐఐటీ మద్రాస్‌వారి ఏఐ, డాటా సైన్స్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులు తేజస్విని, అక్షయ, మోష, కృష్ణవేణి, నిత్యలహరి, లాస్య ప్రియ, అక్షయ్‌కుమార్, ఉపాధ్యాయులు బైరి రమేష్‌లకు సర్టిఫికేట్లను అందజేశారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో సంగారెడ్డి జట్ల విజయం

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అండర్-14 ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఎస్‌వీఎం గగన్ క్రికెట్ మైదానంలో సోమవారం సంగారెడ్డి బి జట్టు, సిద్దిపేట పింక్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన సంగారెడ్డి బి జట్టు నిర్ధారిత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 268 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసి సిద్దిపేట పింక్ జట్టు 168 పరుగులకే ఆలౌట్ కావడంతో సంగారెడ్డి బి జట్టు గెలిచింది. రెండో మ్యాచ్ టీవీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో సంగారెడ్డి ఎ జట్టు, సిద్దిపేట ఆరెంజ్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసి సంగారెడ్డి ఎ జట్టు 45 ఓవర్లలో 205 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సిద్దిపేట ఆరెంజ్ జట్టు 143 పరుగులకు ఆలౌట్ కావడంతో సంగారెడ్డి ఎ జట్టు విజయం సాధించింది.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎండీ నుస్రత్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైద్యారోగ్య శాఖలో పనిచేసే 104 ఉద్యోగులకు గత ఆరు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి. నుస్రత్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 104 వైద్యసేవలో జిల్లాలో డ్రైవర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, సెక్యూరిటీ గార్డులు, ఫార్మాసిస్టులు, లాబ్ టెక్నీషియన్లు మొత్తం 45మంది పనిచేస్తున్నారన్నారు. వీరిలో ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులను మినహా మిగతా వారిని మెడికల్ కళాశాల, ఇతర శాఖల్లో కేటాయించారని తెలిపారు. ఇంత వరకు ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులను మాత్రం ఏ శాఖను కేటాయించలేదన్నారు. వేతనాలు గత ఆరు నెలలుగా నిలిచిపోవడంతో ఉద్యోగులు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

శిలాంపల్లిలో పొలంబడి ప్రారంభం

చిలప్‌చెడ్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులకు పంటలపై పూర్తి అవగాహన కల్పించేందుకే పొలంబడుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. సోమవారం శిలాంపల్లి రైతువేదికలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయశంకర్ ఆధ్వర్యంలో రైతు పొలంబడి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం లో సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలని చెప్పడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్, హొన్నప్పగౌడ, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సాధనకు పోరాటం

జహీరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) కార్మికుల సమస్యల సాధనకు సీఐటీయూ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని రాష్ట్ర సీఐటీయూ అధ్యక్షుడు చుక్క రాములు పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ మండలం బూచనెల్లి గ్రామ శివారులోని సీఐఈ పరిశ్రమలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పల్లెలకు బస్సులు రావా..?

- నిజాంపేట మండలంలో కంకర తేలిన రహదారులపై ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణం
- కళాశాలలకు సమయానికి చేరుకునేందుకు విద్యార్థుల అపసోపాలు
- ఫ్రీ బస్సు అని సంతోషిస్తే.. అసలుకే ఎసరొచ్చిందని మండల ప్రజల ఆగ్రహం



బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ రోడ్డుపై నిరసన తెలుపుతున్న గ్రామస్థులు(ఫైల్)

నిజాంపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ఆర్టీసీ బస్సులకు బ్రేక్ పడిందా.. అంటే నిజమే అనిపిస్తుంది. ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పిస్తున్నామని చెబుతుండగా, మరోవైపు అధికారులు గతంలో ఉన్న బస్సు సౌకర్యాన్ని కూడా ఎత్తేయడం ఏమిటని నిజాంపేట మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ అధికారుల పని తీరు ప్రభుత్వ లక్ష్యాన్ని పక్కదారి పట్టిస్తున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బస్సు సౌకర్యం కల్పించాలని కోరినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన మండల ప్రజలు పలుమార్లు రోడ్డెక్కి ఆందోళనకు దిగినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

'ప్రైవేటు' ప్రయాణంతో ఇక్కట్లు

గతంలో నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి నడిచిన బస్సులు ప్రస్తుతం రావడం లేదు. రామాయంపేట నుంచి చల్మెడ, నందగోకుల్, నస్కల్, రాంపూర్ మీదుగా బీబీపేట వరకు. కామారెడ్డి డిపో నుంచి బీబీపేట, రాంపూర్ మీదుగా చిన్న నిజాంపేట, రామేశ్వరం పల్లి అగ్రహారం, భూంపల్లి వరకు బస్సులు క్రమం తప్పకుండా తిరిగేవి. కానీ ప్రస్తుతం ఒక్క బస్సు కానరాకపోవడంతో ప్రయాణికులు ఆటోల్లో ప్రయాణిస్తూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఓవైపు గుంతలు పడ్డ రోడ్లు, కంకర తేలిన దారులపై ఆటోలలో వెళ్తూ తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. అంతేకాదు రోజూ రామాయంపేటకు కళాశాలకు వెళ్లే విద్యార్థినీ విద్యార్థులు సైతం బస్సులు లేక సమయానికి చేరుకోలేని దుస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా మెదక్, కామారెడ్డి, దుబ్బాక ఆర్టీసీ యాజమాన్యం గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించాల్సిందిగా ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే బస్సుల కోసం ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి వస్తుందంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకొని ఈ సమస్యను పరిష్కరించాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా గీతాజయంతి



ఖేడ్‌లోని షిర్డీసాయిబాబా ఆలయంలో గీతా జయంతి సందర్భంగా భక్తుల పూజలు



తూప్రాన్‌లో గీతా జయంతి కార్యక్రమంలో పూజలు చేస్తున్న భక్తులు

నారాయణఖేడ్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయం ఆవరణలో గీతా జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు మోహన్ జోషీ ఆధ్వర్యంలో హోమంతో పాటు గీత గ్రంథ పఠనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ బాధ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నారాయణఖేడ్ పట్టణ శివార్లలోని భక్త మార్కండేయ ఆలయంలో గత ఆరు నెలలుగా కొనసాగుతున్న గీత పారాయణ ముగింపు సందర్భంగా సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గీత శ్లోకాలు, డ్రాయింగ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించారు.పోటీల్లో 235మంది విద్యార్థులు పాల్గొన్నారు. డ్రాయింగ్ విభాగాల్లో శిశుమందిర్ విద్యార్థిని అక్షర మొదటి బహుమతి, లోహిత్‌రాజ్ రెండో బహుమతి, శ్రీజ మూడో బహుమతిని దక్కించుకున్నారు. ప్రతిభ చాటిన వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు, అందించారు.

● **జహీరాబాద్:** మండలంలోని పస్తాపూర్ అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ఏకాదశి భగవద్గీత జయంతి సందర్భంగా సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణంను నిర్వహించారు. గీత వాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయా ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

● **తూప్రాన్:** పట్టణంలోని శ్రీగీతామందిరంలో 43వ గీతా జయంతోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పూజారి ఉదయ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో శ్రీకృష్ణభగవాన్‌కు అష్టదశ (18) ద్రవ్యాలతో మహాభిషేకం, భగవద్గీత పారాయణం, హవనం, పూర్ణాహుతి, అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

● **పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేటలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో గీతా జయంతిని పురస్కరించుకొని సోమవారం విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పఠనం పోటీలు నిర్వహించారు. భగవద్గీత శ్లోకాల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

దత్త జయంతి వేడుకలకు ఏర్పాట్లు



మెదక్ దత్తాత్రేయ స్వామి ఆలయంలో కొలువైన ఏకముఖి దత్రాత్రేయుడు



ఝరాసంగం: వేడుకలకు సిద్ధమైన బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమం, ఆలయంలో స్వామివారు

మెదక్ అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీదత్తాత్రేయ స్వామివారిని త్రిమూర్తుల స్వరూపంగా భక్తులు పూజిస్తారు. దత్తజయంతిని పురస్కరించుకుని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ప్రముఖ ఆలయాలు, ఆశ్రమాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మెదక్ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన శ్రీ ఏకముఖి దత్తాత్రేయ స్వామి ఆలయం మూడు రోజులపాటు నిర్వహించనున్న దత్తజయంతి వేడుకలను సిద్ధమైంది.

ఈ ఆలయానికి 400 ఏళ్ల చరిత్ర కలిగి ఉన్నట్లు ఆలయ అర్చకులు దేశాయిపేట పాండురంగ శర్మ తెలిపారు. వేడుకలు మంగళవారం నుంచి గురువారం వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

● **ఝరాసంగం:** మండల పరిధిలోని బర్దీపూర్‌లో గల దత్తగిరి ఆశ్రమంలో ఈ నెల 2నుంచి 6 వరకు జరిగే దత్త జయంతి వేడుకలకు ఆశ్రమం విద్యుత్ దీపాలతో ముస్తాబైంది. ఈ ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. ఆశ్రమానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖమణి అవధూత గిరి మహారాజ్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. జహీరాబాద్ డిపో నుంచి ఆశ్రమానికి ఆర్టీసీ బస్సులు నడుస్తాయని వారు తెలిపారు.

● **నారాయణఖేడ్:** దత్త జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కర్ణాటకలోని మాణిక్ నగర్‌లో గల మాణిక్ ప్రభు మందిరం ముస్తాబైంది. మాణిక్‌నగర్‌లో డిసెంబరు2 నుంచి 5వ తేదీ వరకు విశేషమైన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రాణాంతక వ్యాధుల నుంచి అప్రమత్తంగా ఉండాలి





నర్సాపూర్ ఆసుపత్రిలో ఎయిడ్స్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయాధికారి హేమలత, పెద్దచింతకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ విద్యార్థులు

నర్సాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి హేమలత పేర్కొన్నారు. పుష్టికరమైన ఆహారం, శారీరక వ్యాయామం యోగాసనాల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆమె సూచించారు. సోమవారం నర్సాపూర్ ఆసుపత్రిలో ఎయిడ్స్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జడ్జి పాల్గొని మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉండి మీపై ఆధారపడిన కుటుంబాలకు ఇబ్బందులు కలిగించవద్దని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు నిరుపమ, రాము, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థుల అవగాహన ర్యాలీ

ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని పెద్దచింతకుంటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానికులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి

కల్హేర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఎల్లవేళలా కృషి చేస్తుందని ఆ శాఖ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ అన్నారు. కల్హేర్ మండల విద్యాధికారి శ్రీనివాసులు ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం వారి పక్షాన నిరంతరం తమ సంఘం ప్రభుత్వంతో పోరాడుతూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు మాణయ్య, గౌరవ అధ్యక్షుడు గుండు గోవర్ధన్, కల్హేర్, సిర్గాపూర్, నిజాంపేట, నాగల్‌గిద్ద ఎంఈవోలు,నాయకులు ఉన్నారు.

నామినేషన్ల స్వీకరణలో పొరపాట్లు జరగొద్దు



నిజాంపేట: నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నిజాంపేట/ చిలప్‌చెడ్/ పెద్దశంకరంపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నామినేషన్ పత్రాల స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. నిజాంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాలను ఆయనతో పాటు తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ వేర్వేరుగా పరిశీలించి మాట్లాడారు ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలన్నారు. ప్రతీ నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజిరెడ్డి తదితరులు ఉన్నారు. చిలప్‌చెడ్ మండల కేంద్రంలోని నామినేషన్ కేంద్రాన్ని సీఐ జాన్‌రెడ్డి సందర్శించి ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు. వెంట ఇన్‌చార్జి ఎంపీవో తిరుపతి, ఎస్‌ఐ నర్సింహులు కార్యదర్శి క్రిష్ణ సిబ్బంది ఉన్నారు. పెద్దశంకరంపేట మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు మండల ఎన్నికల ప్రత్యేకాధికారి తుకారం తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవోషాకీర్ అలీ, ఆర్.ఏ.రమేష్, తదితరులు ఉన్నారు.

డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు

● **పెద్దశంకరంపేట:** గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా సోమవారం పోలీసులు పెద్దశంకరంపేట లోని బస్టాండ్, పలు దుకాణాల్లో డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు చేపట్టారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు నార్కొటిక్ డాగ్ ద్వారా తనిఖీలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పేట ఎస్‌ఐ ప్రవీణ్ రెడ్డి, ఏఎస్‌ఐ చంద్రమోహన్, మెదక్ డాగ్ స్క్వాడ్ బృందం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ



చౌటకూర్‌లో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

పుల్‌కల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ తెలిపారు. సోమవారం ఆయన చౌటకూర్ మండలంలోని శివంపేట, సుల్తాన్‌పూర్, చౌటకూర్‌లలోని నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు.

కోడ్ అతిక్రమిస్తే చర్యలు: సీఐ వెంకట్‌రెడ్డి

కంగ్టి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభ్యర్థులు, కార్యకర్తలు ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన కంగ్టిలో విలేకరులతో మాట్లాడారు.

రాత్రి దాకా దాఖలు

(5వ పేజీ తరువాయి)

దాఖలయ్యాయి. జిల్లాలోని పది మండలాల పరిధిలోని 243 సర్పంచ్ స్థానాలకు 528, ఇక 2164 వార్డులకు 1803 నామినేషన్లు వచ్చాయి. తొలిరోజైన ఆదివారం సర్పంచ్ స్థానాలకు 141, వార్డులకు 200 నామినేషన్లు దాఖలయ్యాయి.

చిన్నశంకరంపేటలో రాత్రి 10.30 వరకు

మెదక్ జిల్లాలో రెండో విడత నామినేషన్లు జోరుగా సాగుతున్నాయి. రెండో విడతలో ఎనిమిది మండలాల్లోని 149 పంచాయతీల్లో 1290 వార్డులకు ఎన్నికలు జరుగుతుండగా తొలిరోజు సర్పంచ్ స్థానాలకు 155, వార్డులకు 280 వరకు నామినేషన్లు దాఖలయ్యాయి. రెండోరోజైన సోమవారం కేంద్రాలకు అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. చిన్న శంకరంపేట మండల కేంద్రంలో రాత్రి 10.30 వరకు కూడా నామినేషన్ల స్వీకరణ పూర్తి కాలేదు. సాయంత్రం సమయం ముగిసిన అనంతరం దాఖలు చేసుకునేందుకు అభ్యర్థులకు టోకెన్లు పంపిణీ చేశారు. 110 మందికి టోకెన్లు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. అలాగే మెదక్ మండలంలోనూ రాత్రి వరకు నామినేషన్లు ఎంతమంది వేశారో కొలిక్కిరాలేదు. చేగుంట మండలంలోని 25 సర్పంచ్ స్థానాలకు 65, వార్డులు 226 కాగా 267 దాఖలయ్యాయి. మనోహరాబాద్ మండలంలోని 17 సర్పంచ్‌లకు 53, వార్డులు 148కి 241 వచ్చాయి. నార్సింగి మండలంలోని 9 సర్పంచ్ స్థానాలకు 27, వార్డులు 80 కాగా 97 నామినేషన్లు వేశారు. నిజాంపేట మండలంలో 16 సర్పంచ్ స్థానాలకు 34, 142 వార్డులకు 121 దాఖలయ్యాయి. రామాయంపేట మండలంలో 16 సర్పంచ్‌లకు 48, 138 వార్డు స్థానాలకు 104 మంది నామినేషన్లు వేశారు. తూప్రాన్ మండలంలోని 14 సర్పంచ్ స్థానాలకు 48, వార్డు స్థానాలు 114కు 104 నామినేషన్లు దాఖలయ్యాయి.

నిర్భయంగా ఫిర్యాదు చేయండి

● సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పోలీస్ ప్రజావాణి

సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సంగారెడ్డి, మెదక్ జిల్లాల ఎస్పీలు పరితోష్ పంకజ్, డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయా జిల్లాల పోలీసు కార్యాలయాల్లో వేర్వేరుగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో భాగంగా వారు వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులను నేరుగా స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికతో విని, ఎస్‌హెచ్‌వోలతో ఫోన్‌లో మాట్లాడి పలు కేసుల పరిష్కారంలో జాప్యానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీలు మాట్లాడుతూ.. చట్టాన్ని అమలు పరచడంలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని పోలీసులకు సూచించారు. ప్రజలు తమ సమస్యలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పరిష్కారం దొరకని పక్షంలో నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే ప్రజావాణి సేవలను వినియోగించుకోవాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



సిసి రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే రోహిత్‌రావు పేర్కొన్నారు. మెదక్ పట్టణంలోని 7, 8, 20వ వార్డులలో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌లోని 32 వార్డుల అభివృద్ధికి గాను ఇప్పటికే రూ.55 కోట్లు మంజూరు చేయించామన్నారు. ఆ పనులను సైతం త్వరలోనే ప్రారంభించుకునేందుకు ఆదేశించామన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిఈ మహేష్, నాయకులు మేడి మధుసూదన్‌రావు, దుర్గాప్రసాద్, అంజాద్, లక్ష్మీనారాయణగౌడ్, గోదల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి



విజేతలకు నగదు పురస్కారాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): క్రీడలపై యువత ఆసక్తిని పెంచుకుని రాణించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బీరంగూడలో నిర్వహించిన 4వ పవర్‌లిఫ్టింగ్ తెలంగాణా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు ఇంటూరి రేఖ, మాజీ ఎంపీపీ దేవానంద్, నాయకులు నర్సింహగౌడ్, విజయ్‌కుమార్, సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్, షకీల్, రాధ, రంజన్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీలో వద్దు.. మున్సిపాలిటీగానే ఉంచండి



కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఐడీఏబొల్లారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి

ఐడీఏబొల్లారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ప్రజలు నివాసం ఉంటున్న ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో కలపకుండా నిలువరించాలని ఐడీఏ బొల్లారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశ్రామికవాడతో కలిసి ఉన్నందున కార్మికులు ఎక్కువగా నివసిస్తున్నారని తెలిపారు. కొత్తగా ప్రభుత్వం జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే విధంగా ఉత్తర్వులు జారీ చేయడం నిరుపేదల పాలిట శాపంగా మారిందని తెలిపారు. ఇంటి పన్నులు వందశాతం పెరుగుతాయని, తాగునీటి బిల్లులు ఇప్పటికే భారంగా మారాయని వివరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సంధ్యాజైపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సాయికిరణ్‌రెడ్డిశైలజ పుండరీకం, మన్నె సతీష్, బీరప్పయాదవ్, శ్రీకాంత్‌యాదవ్, ప్రభునాయక్, రత్నం, శారద తదితరులు ఉన్నారు.


అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి



నాయకులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు, డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్

చిన్నశంకరంపేట, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సూచించారు. సోమవారం మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. మాజీ జడ్పీటీసీ పోతరాజు రమణ ఆధ్వర్యంలో మిర్జాపల్లి తండా, ఎస్ కొండాపూర్, ప్యాటగడ్డ, తదితర గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ పార్టీ నుంచి 500 మంది కాంగ్రెస్ పార్టీలో చేశారు. మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు, డీసీసీ అధ్యక్షుడు అంజనేయులు గౌడ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ మోసాలను ప్రజలకు తెలియజెప్పాలి



కొల్చారం: ఫంక్షన్ హాల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

వెల్దుర్తి/కొల్చారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి బీఆర్‌ఎస్ పార్టీ మద్దతు గల అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. సోమవారం వెల్దుర్తి, కొల్చారం మండలకేంద్రాల్లో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. వెల్దుర్తిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల పరిధిలోని ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాల గురించి గడప గడపకూ వెళ్లి వివరించాలన్నారు. తప్పుడు హామీలతో రెండేళ్లుగా ప్రజలను కాంగ్రెస్ ఎలా మోసం చేస్తుందో ఇంటింటికీ వివరించాలని తెలిపారు. ప్రజా సమస్యలను తీర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర నాయకులు ఉమ్మన్న గారి దేవేందర్‌రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు. కొల్చారంలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గౌరీ శంకర్ సంతోష్ మేఘమాల మంజుల వేమారెడ్డి ఉన్నారు.